సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 17 । మార్చి । 2023

I



సిరులతల్లికి తులసి పూజ

విశాఖ: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు.



దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం

చోడవరంలో ఉపకరణాల పంపిణీకి దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు శిబిరం నిర్వహించారు. IIలో



దొంగనోట్ల ముఠా గుట్టురట్టు

దొంగనోట్ల చలామణి ముఠాను చింతూరు సబ్ డివిజన్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఆదిలోనే అడ్డుకట్ట వేశారు. IIలో

న్యూస్‌రీల్

అమరజీవికి ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డీఆర్వో వెంకటరమణ

తుమ్మపాల: అమరజీవి పొట్టి శ్రీరాములు ఒక గొప్ప త్యాగమూర్తని, భాషాప్రయుక్త రాష్ట్రాలకు ఆద్యుడని జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర సాధన కోసం 58 రోజులు నిరాహార దీక్షతో ప్రాణత్యాగం చేసిన మహనీయుడన్నారు. ఆయన త్యాగఫలంగానే 1953 అక్టోబర్ 1న ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్‌ఇండియా ఉద్యమాలలో పొట్టి శ్రీరాములు పాల్గొని మూడుసార్లు జైలుకు వెళ్లారని వివరించారు. మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాల్లో వారి త్యాగాలను, పోరాట పటిమను తెలుసుకుని యువత స్ఫూర్తి పొంది, సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎ.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'టెన్త్ ఫలితాల్లో జిల్లాకు పేరు తేవాలి'



పదవ తరగతి విద్యార్థులతో డీఈవో

చోడవరం రూరల్ : పదో తరగతిలో అధిక మార్కులు సాధించి పాఠశాలతోపాటు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ సూచించారు. గురువారం ఆమె చోడవరం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలను సందర్శించారు. ప్రభుత్వ హైస్కూల్లో టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతూ త్వరలో జరగనున్న పరీక్షలకు పూర్తిస్థాయిలో సంసిద్ధం కావాలన్నారు. పరీక్షల సమయంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పాఠశాలలో లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ అమలు తీరును పరిశీలించారు. ట్యాబ్ ద్వారా పాఠ్యాంశాలను సమగ్రంగా నేర్చుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. అనంతరం జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు వెళ్లి టీచింగ్ ఎట్ రైట్ లెవల్‌ను, గ్రేడింగ్‌ను, వారి అవగాహనను పరిశీలించారు. పర్యటనలో ఎంఈవో శ్రీనివాసరావు, హెచ్ఎంలు డి.వసంత, వెంకటేశ్వరరావు, సీఆర్‌పీ కేవీఎం నాయుడు పాల్గొన్నారు.

ద్వితీయం.. ప్రశాంతం

- ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం
- 97.2 శాతం మంది విద్యార్థులు హాజరు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సచివాలయ మహిళా పోలీసు

సాక్షి, అనకాపల్లి: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గురువారం ద్వితీయ భాష తెలుగు/సంస్కృతం పరీక్ష జరిగింది. అనకాపల్లి జిల్లాలో 34 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా, 8.30 గంటల నుంచి విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు నిర్వహించారు. తొలిరోజు పరీక్షకు 97.2 శాతం హాజరు నమోదైంది. జనరల్ కోర్సు విద్యార్థులు 11,215 మందికి గాను 10,919 మంది హాజరయ్యారు. ఒకేషనల్ 2,055 మందికి 1,982 మంది హాజరయ్యారు. జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి మొత్తం 13,270 మంది విద్యార్థులకు 12,901 మంది హాజరైనట్లు జిల్లా వృత్తి విద్యాధికారి సుజాత వెల్లడించారు.

ఇంటి, ఖాళీ జాగా పన్నుపై వడ్డీ రద్దు

విశాఖ: 2022–2023 ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్ను, ఖాళీ జాగా పన్ను బకాయిలపై వడ్డీ రద్దు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి గురువారం జీవో నంబర్ 34 విడుదల చేశారు. ఈ నెల 31లోగా పన్ను బకాయిలు ఒకేసారి చెల్లించిన వారికి ఈ సౌకర్యం కల్పిస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విశాఖ.. వికాసం

స్మార్ట్ సిటీ కింద రూ.50 కోట్ల కేటాయింపు

నక్కపల్లి ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి

నర్సీపట్నం, పాడేరు మెడికల్ కళాశాలలకు నిధులు

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రూ.302.04 కోట్లు

ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి రూ.141.79 కోట్లు



- కాబోయే పరిపాలన రాజధానిగా ఉద్ఘాటన
- ఇక్కడ మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు
- రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి విశాఖకు అధిక ప్రాధాన్యం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర బడ్జెట్‌లో విశాఖ వికసించింది. ఉమ్మడి విశాఖ జిల్లాకు అధిక ప్రాధాన్యం లభించింది. కాబోయే పరిపాలన రాజధానిపై ప్రత్యేక ఫోకస్ కనిపించింది. స్మార్ట్ సిటీ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నిధుల కేటాయింపు, నక్కపల్లి ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి వంటివి రాష్ట్ర ప్రభుత్వం విశాఖపై చూపుతున్న శ్రద్ధకు దర్పణం పడుతున్నాయి. ఇంకా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనాలు విస్తృతం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై వివిధ వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ కానున్న విశాఖకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్టు బడ్జెట్‌లో ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రకటించారు. ఈ నిధులతో నగరంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమివ్వనున్నారు. రోడ్లు, డ్రెయిన్లు, పచ్చదనం, సుందరీకరణ, పార్కులు వంటివి మెరుగు పరచడంతోపాటు మరెన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఫలితంగా విశాఖలో పరిపాలన రాజధానికి అవసరమైన అభివృద్ధికి బాటలు పడనున్నాయి. స్మార్ట్ సిటీ నిధుల కింద విశాఖకు రూ.50 కోట్లు కేటాయించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఈ బడ్జెట్‌లో 302.04 కోట్లు కేటాయించారు. వర్సిటీలో పలు అభివృద్ధి పనులు జరగనున్నాయి.



సుజల స్రవంతికి రూ.141.79 కోట్లు

ఎంతో ప్రాధాన్యం కలిగిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి ఈ బడ్జెట్‌లో రూ.141.79 కోట్లు కేటాయించి ఈ పథకంపై ప్రభుత్వానికున్న శ్రద్ధను చాటుకున్నారు. ఈ నిధులు ఈ పథకం శరవేగంగా పూర్తి కావడానికి దోహదపడుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. విశాఖపట్నం–చెన్నై కారిడార్ పరిధిలోని నక్కపల్లి ఇండస్ట్రియల్ క్లస్టర్ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్టు బడ్జెట్‌లో పేర్కొన్నారు. దీంతో ఆ ప్రాంతం గణనీయంగా అభివృద్ధి చెందే వీలుంటుంది. మరోపక్క ఈ బడ్జెట్‌లో పర్యాటక, సాంస్కృతిక ప్రగతి కోసం రూ.1,291 కోట్లు కేటాయించారు. పర్యాటకపరంగా ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్న విశాఖలో ఆ రంగానికి మరింత ఆదరణ పెరిగే అభివృద్ధి పనులకు ఆస్కారం కలుగుతుంది. మరోవైపు విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధికి రూ.236.85 కోట్లు, ఈ కారిడార్ భూసేకరణ, పరిశ్రమల అవసరాలకు రూ.200.25 కోట్లు కేటాయించారు.

ఇంకా మరెన్నో..

విశాఖలో గిరిజన పరిశోధన సంస్థ ఏర్పాటు, నిర్మాణానికి రూ.4.43 కోట్లు, విశాఖలో ఆక్టోపస్‌కు రూ.6.89 కోట్లు, పోలీస్ కమిషనరేట్‌లో పోలీస్ స్టేషన్ల ఆధునికీకరణకు రూ.33.58 కోట్లు, గ్రేహౌండ్స్ బలోపేతానికి, ప్రాంతీయ శిక్షణ కేంద్రానికి రూ.25.87 కోట్లు, విశాఖ సాంకేతిక విద్య, ఉపాధి, శిక్షణ విభాగానికి రూ.44 కోట్లు చొప్పున కేటాయించారు. గిరిజన ప్రాంతంలో మెడికల్ కళాశాలల ఏర్పాటుకు రూ.120 కోట్లు, మైదాన ప్రాంతంలో మెడికల్ కాలేజీల ఏర్పాటుకు రూ.220 కోట్లు అలాట్ చేశారు. దీంతో పాడేరు, నర్సీపట్నంలో నిర్మించ తలపెట్టిన వైద్య కళాశాలలకు భారీగా నిధులు విడుదల కానున్నాయి. మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ కోసం రూ.50 కోట్లు కేటాయించారు. విశాఖలోని మత్స్యకారులకు రూ.4 కోట్ల ప్రయోజనం చేకూరనుంది.

సంక్షేమ బడ్జెట్



సంక్షేమం, అభివృద్ధి సమన్వయం చేస్తూ రూపకల్పన చేసిన బడ్జెట్ ఇది. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిచ్చారు. సమాజంలో పేదలను ఆదుకోవాలనే ఉద్దేశం, సమానత్వం సాధనకు బడ్జెట్ ఉపయుక్తంగా నిలుస్తుంది. సమాజంలో అట్టడుగు వర్గాలను ఉన్నతంగా తీర్చిదిద్దే విధంగా, అభివృద్ధిని జోడించిన నిర్ణయాలు కనిపిస్తున్నాయి.

– ఆచార్య పి.విశ్వనాథం, కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం

విద్యకు అధిక ప్రాధాన్యం



ప్రాథమిక, సాంకేతిక, ఉన్నత విద్యా రంగాలకు రూ.32 వేల కోట్లు కేటాయించడం శుభపరిణామం. సంక్షేమ పథకాలు, పరిశ్రమలకు సమ ప్రాధాన్యమిచ్చేలా బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. నవరత్నాలను శతశాతం అమలు చేసే విధంగా కేటాయింపులు పెరుగుతున్నాయి. విద్యకు కేటాయింపులు పెంచడం వెనుక మానవ వనరులను తీర్చిదిద్దడం లక్ష్యంగా కనిపిస్తోంది.

– ఆచార్య ఎస్.పుల్లారావు, అర్థశాస్త్ర విభాగాధిపతి

నైపుణ్యాభివృద్ధికి ప్రోత్సాహం



రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి రూ.1166 కోట్లు కేటాయించడం మంచి పరిణామం. 192 నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలనే నిర్ణయం అభినందనీయం. తద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఐటీఐల్లో నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన నిర్ణయం అభినందనీయం.

– డాక్టర్ జి.వీర్రాజు, విభాగాధిపతి, ప్రభుత్వ పాలన రాజనీతిశాస్త్ర విభాగం

ఆర్‌బీకేల్లో బ్యాంకింగ్ సేవలు



సుస్థిరత, సుపరిపాలన, సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర వార్షిక బడ్జెట్ ఉంది. రైతులకు సున్నా వడ్డీ రుణాల కోసం రూ.500 కోట్లు కేటాయించడం హర్షించదగ్గ అంశం. ఆర్‌బీకేల్లోనే బ్యాంకింగ్ సదుపాయాలు, రైతుల ఆదాయం పెంచే విధంగా ఆర్బీకే సేవలు విస్తృతం చేయడం, 8,837 ఆర్బీకేల నిర్మాణాలకు కేటాయింపులు.. ఇది రైతు సంక్షేమ బడ్జెట్‌గా నిలుస్తుంది.

– చింతకాయల అనిత, చైర్‌పర్సన్, డీసీసీబీ

వ్యవసాయానికి రెట్టింపు కేటాయింపులు



టీడీపీ ప్రభుత్వంలో వ్యవసాయ బడ్జెట్ రూ.19,078 కోట్లు ఉంటే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.41,436 కోట్లు కేటాయించారు. రైతులకు సబ్సిడీ రుణాలు, సున్నా వడ్డీకే రుణాలు, వ్యవసాయ యంత్రాల ఆధునికీకరణకు రూ.1,212 కోట్లు కేటాయించారు.

– చిక్కాల రామారావు, చైర్మన్, జిల్లా వ్యవసాయ సలహా మండలి

ఉత్కంఠ

- కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్
- మొత్తం 7 రౌండ్లు.. ఒక్కో రౌండ్‌లో 28 వేల ఓట్ల లెక్కింపు
- శుక్రవారం మధ్యాహ్నం తుది ఫలితం?



విశాఖ స్వర్ణభారతి స్టేడియంలో జరుగుతున్న కౌంటింగ్

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. గురువారం అర్ధరాత్రికి రెండు రౌండ్లు పూర్తికాగా.. ఇంకా ఐదు రౌండ్ల లెక్కింపు కొనసాగుతోంది. శుక్రవారం మధ్యాహ్నం తుది ఫలితం వెలువడే అవకాశం ఉంది. గురువారం ఉదయం 7 గంటలకు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డా. మల్లికార్జున సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ బాక్సులు బయటకు తీసుకొచ్చారు. అనంతరం ర్యాండమైజేషన్ ద్వారా బాక్సులను ఓపెన్ చేసి అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు సమక్షంలో కట్టలు కట్టే ప్రక్రియ ప్రారంభించారు. మొత్తం 12 రౌండ్లలో బ్యాలెట్ పేపర్లు కట్టలు కట్టారు. బ్యాలెట్ పేపర్లు కట్టలు కట్టేందుకు దాదాపు 10 గంటల సమయం పట్టింది. అనంతరం.. ఒక్కో రౌండ్‌కు 28 వేల ఓట్లు చొప్పున 2,00,926 ఓట్లను ఏడు రౌండ్లుగా విభజించారు. ఒక్కో టేబుల్‌పై 1000 చొప్పున 28 టేబుల్స్‌పై మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో మొదటి రౌండ్ ప్రక్రియ సాయంత్రం 6.30 గంటల సమయంలో ప్రారంభమైంది. తొలి రెండు రౌండ్లలో టీడీపీ మద్దతు అభ్యర్థి వేపాడ చిరంజీవిరావుకు మెజార్టీ లభించింది.

పోస్టల్ బ్యాలెట్‌లో చెల్లని ఓట్లు 228

వివిధ ప్రాంతాల్లో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసుకునే వెసులుబాటు కల్పించారు. మొత్తం 767 పోస్టల్ బ్యాలెట్స్ కేటాయించగా కేవలం 583 మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 228 ఓట్లు చెల్లని ఓట్లుగా పరిగణించారు. ప్రాధాన్యత అంకెలు వేయడంలో కొందరు ఉద్యోగులు తప్పులు చేస్తే.. ఓటుతో పాటు సర్వీస్ సర్టిఫికెట్ నకలు జత చేయడాన్ని మరికొందరు విస్మరించారు. మిగిలిన 355 ఓట్లను బ్యాలెట్‌బాక్సుల నుంచి కట్టలు కడుతున్న వాటిలో కలిపేశారు. పోస్టల్ బ్యాలెట్స్ ఓట్లను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున స్వయంగా పరిశీలించారు.



స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వద్ద పోలీసు కమిషనర్ శ్రీకాంత్ పరిశీలన

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

కౌంటింగ్ జరుగుతున్న స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత వ్యవస్థను అమలు చేశారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఎప్పటికప్పుడు భద్రతను పర్యవేక్షించారు.




బ్యాలెట్ బాక్సులు తీసుకువస్తున్న సిబ్బంది



బ్యాలెట్ పేపర్లను కట్టలు కడుతున్న అధికారులు

పెద్దేరు జలాశయం ఆధునికీకరణకు రూ.84.40 కోట్లు

- నిధుల మంజూరుకు పరిపాలన ఆమోదం
- డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు వెల్లడి
- తండ్రి ఆశయాన్ని నెరవేర్చిన సీఎం జగన్
- మూడు మండలాల్లో 63 గ్రామాలకు సాగునీరు
- సస్యశ్యామలం కానున్న 19,969 ఎకరాల ఆయకట్టు



పెద్దేరు జలాశయం



డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

మాడుగుల: తెన్నేటి విశ్వనాథం (పెద్దేరు) జలాశయం ఆధునికీకరణ పనులకు రూ.84.40 కోట్లు మంజూరైనట్లు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆర్‌సీ నంబరు 120/16-03-2023 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి గురువారం పరిపాలన ఆమోదం లభించిందని చెప్పారు. ఆధునికీకరణ పనులు పూర్తయితే మాడుగుల, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లోని 63 గ్రామాల్లో 19 వేల 969 ఎకరాల మెట్ట భూములు సస్యశ్యామలం కానున్నాయన్నారు. ఆర్ఎంసీ, రాచకట్టు పంట కాల్వలకు 38.2 కిలోమీటర్ల సీసీ లైనింగ్ నిర్మాణం జరగడంతో జలాశయం శివారు ఆయకట్టు వరకు సాగునీరు అంది, రెండు పంటలు పండుతాయన్నారు.

రైతుల గుండెల్లో తండ్రీ తనయులు

ఇవి మెట్ట భూములు కావడంతో సాగునీరు లేక ప్రతి ఏటా పంటలు నష్టపోతున్నారని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలాశయం పనులు త్వరగా పూర్తి చేయించి 2006లో జాతికి అంకితం చేశారు. సీసీ లైనింగ్ ఏర్పాటు చేయాలని అప్పట్లోనే అధికారులను ఆదేశించారని, ఆయన మృతి చెందడంతో ఆ పనులు నేటి వరకు నిలిచిపోయాయని ముత్యాలనాయుడు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు తండ్రి ఆశయం నెరవేర్చాలని రైతులు వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లారని, అది ఈనాటికి ఫలించిందన్నారు. రూ.84.40 కోట్లు వెచ్చించి జలాశయం ఆధునికీకరిస్తే శివారు ఆయకట్టుకు నీరందుతుందని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సన్న చిన్నకారు రైతులు గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు.

లోపాలుంటే సరిచేస్తాం

- రైతులు అపోహ పడవద్దు
- సంతృప్తి చెందితేనే ముందుకు..
- భూముల రీసర్వే పరిశీలించిన జేసీ



రంగుమారిన చింతపండు గురించి హెచ్ఎంను నిలదీస్తున్న జేసీ కల్పనాకుమారి

రావికమతం: గుమ్మాళ్లపాడులో జరుగుతున్న రెండో విడత భూ రీసర్వే కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి పరిశీలించారు. ఈ గ్రామంలో గతంలో చేపట్టిన సర్వేలో లోపాలుండటంతో పలువురు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సవరణల కోసం రీసర్వేకు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం నుంచి రీసర్వే జరుగుతోంది. ఆ కార్యక్రమాన్ని గురువారం జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి విడతలో 145 రెవెన్యూ గ్రామాల్లో సమగ్ర భూ రీసర్వే శతశాతం పూర్తయిందని చెప్పారు. రెండో విడతగా 247 గ్రామాల్లో సర్వే చురుగ్గా జరుగుతోందన్నారు. కొన్ని చోట్ల సర్వేలో కొన్ని లోపాలు జరగడంతో సవరణల కోసం రీసర్వే చేస్తున్నట్టు తెలిపారు. రైతులు అపోహ చెందాల్సిన పనిలేదని, సవరణలు పూర్తి చేసి వారు సంతృప్తి వ్యక్తం చేసిన తర్వాతనే ఆన్‌లైన్‌లో ఉంచుతామన్నారు.

హెచ్ఎంపై జేసీ ఆగ్రహం

మధ్యాహ్న భోజనంలో రంగు మారిన చింతపండును వినియోగిస్తున్నందుకు జేసీ కల్పనాకుమారి హెచ్ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుమ్మాళ్లపాడులో జరుగుతున్న భూముల రీసర్వేను పరిశీలించడానికి గురువారం మండల పర్యటనకు వచ్చిన ఆమె ఆకస్మికంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. వంటలో రంగు మారిన చింతపండును వాడటాన్ని గమనించి ఇదేమిటని ప్రశ్నించారు. ఇంటి వద్ద ఇలాంటి చింతపండు కొని వాడుతారా అని ప్రధానోపాధ్యాయుడు కిరణ్‌ను నిలదీశారు. పర్యవేక్షణ సరిగా లేనందున అతనిపై చర్య తీసుకోవాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె స్థానిక అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. పిల్లలకు పోషకాహారం సక్రమంగా ఇవ్వడం లేదని గమనించి మందలించారు.

ఉక్కు పోరు మరింత ఉధృతం

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ



సంఘీభావం తెలుపుతున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు

సీతంపేట: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, 100 శాతం వాటాలు విక్రయించే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్ చేసింది. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడారు. నాడు కేంద్ర ప్రభుత్వం రూ.4,890కోట్ల పెట్టుబడి పెట్టి, మరో నాలుగు వేల కోట్ల బ్యాంకు రుణాల ద్వారా 3.2మిలియన్ టన్నులతో పరిశ్రమ స్థాపించడం జరిగిందన్నారు. కార్మికుల శ్రమతో 3.2 మిలియన్ టన్నుల నుంచి 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో మూడు లక్షల కోట్ల రూపాయల విలువకు ప్లాంట్ చేరుకుందన్నారు. అంత విలువైన విశాఖ ఉక్కును కారు చౌకగా అదానీకి కట్టబెట్టడానికి కేంద్రం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. విశాఖ ఉక్కుకు గనులు కేటాయించకుండా, రా మెటీరియల్ సరఫరా చేయకుండా, ఓ బ్లాస్ట్‌ఫర్నేస్ మూసివేయించి, వడ్డీ రేట్లు పెంచి, రుణాలు మంజూరు కాకుండా చేసి ప్లాంట్ నష్టపరిచేలా కేంద్రం కుట్రలు చేస్తోందన్నారు. ఈ చర్యలతో ప్లాంట్ ఈ ఏడాది రూ.200 కోట్ల నష్టాలు చవిచూస్తోందన్నారు. కేంద్రం కుట్రల నుంచి విశాఖ ఉక్కును పరిరక్షించుకోవడానికి రెండున్నరేళ్లుగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఈ నెలాఖరు నుంచి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. కమిటీ కో కన్వీనర్ ఎస్.రామచంద్రరావు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్లాంట్ వెయ్యి కోట్ల రూపాయల లాభాలు ఆర్జించిందన్నారు. స్టీల్ ప్లాంట్‌ను వందశాతం ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. కమిటీ ప్రతినిధులు జె.అయోధ్య రామ్, డి.వి.రమణారెడ్డి, ఎం.వెంకటరావు, బి.డేవిడ్, పడాల రమణ, వై.మస్తానప్ప పాల్గొన్నారు.

క్లుప్తంగా

నీట్ పీజీలో 1300 ర్యాంక్


హర్ష ప్రియ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటకు చెందిన హర్షప్రియకు నీట్ పీజీ పరీక్షలో అఖిల భారత ర్యాంక్ 1300 వచ్చింది. కొయిలాడ రమణబాబు కుమార్తె అయిన హర్షప్రియకు ఈ ర్యాంక్ రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నాలుగేళ్ల బాలికతో అసభ్య ప్రవర్తన

- బాలుడికి ఏడాది జైలు శిక్ష

కోటవురట్ల: నాలుగేళ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు నేరం రుజువు కావడంతో 14 ఏళ్ల బాలునికి ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ విశాఖపట్నం జువనైల్ జస్టిస్ బోర్డు జడ్జి కె.వి.ఎల్.హిమబిందు గురువారం తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని ఉగ్గినపాలెం గ్రామంలో 2020లో 14 ఏళ్ల బాలుడు అదే గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలికను తన ఇంటికి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై అప్పట్లో రేప్ కేసు నమోదు చేసి దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ కె.కుమారస్వామి దర్యాప్తు చేసి చార్జిషీటును జువనైల్ జస్టిస్ బోర్డులో ఫైలు చేశారని చెప్పారు. వాద ప్రతివాదనలు అనంతరం బాలునికి న్యాయమూర్తి శిక్ష విధించారన్నారు. జువనైల్ జస్టిస్ హోంకు బాలుని తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి ప్రెస్ అకాడమి కార్యదర్శి పర్యటన

సాక్షి,పాడేరు: ఏపీ ప్రెస్ అకాడమి కార్యదర్శి ఎం.బాలగంగాధర్‌తిలక్ శుక్రవారం నుంచి జిల్లాలోని పాడేరు,అరకులోయ పర్యటిస్తారు. శుక్రవారం రాత్రి పాడేరుకు చేరుకోనున్న ఆయన స్థానిక కాఫీ అతిథి గృహంలో బస చేస్తారు.

నాణ్యమైన రొయ్యల ఉత్పత్తే లక్ష్యం

- హేచరీస్ ఏర్పాటుకు 50 శాతం సబ్సిడీ
- ఉత్తరాంధ్రలో 2250 హెక్టార్లలో ఆక్వా సాగు
- ఎంపెడా ఏడీ ప్రసాద్ నాయక్

నక్కపల్లి : రాష్ట్రంలో ఆక్వా సాగును పెంచి ఎగుమతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్నివిధాలా చర్యలు చేపట్టిందని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు, ఎంపెడా (ద మెరైన్ ప్రోడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ) అసిస్టెంట్ డైరెక్టర్ కె.ప్రసాద్‌నాయక్ తెలిపారు. గురువారం నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆక్వా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో 2250 హెక్టార్లలో ఆక్వా సాగు జరుగుతోందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో 1200 హెక్టార్లు, విశాఖపట్నం జిల్లాలో 1000 హెక్టార్లు, విజయనగరం జిల్లాలో 50 హెక్టార్లలో ఆక్వా సాగు జరుగుతోందన్నారు. ఈ మూడు జిల్లాల్లో 16 రొయ్యల ప్రాసెస్ సెంటర్లు ఉన్నాయన్నారు. ఎంపెడా ఆధ్వర్యంలో 10 ల్యాబ్‌లు ఉన్నాయన్నారు.

ఆక్వా సాగులో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ, సదుపాయాలను తెలియజేసేందుకు ఈ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. నాణ్యమైన రొయ్యను ఉత్పత్తి చేసి ఇతర దేశాలకు ఎగుమతులను ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు.

పండుగప్ప సాగుకు ప్రోత్సాహం

ప్రభుత్వం ఆక్వా సాగు చేసే రైతులకు 50 శాతం సబ్సిడీ ఇస్తోందని వారు తెలిపారు. కనుమరుగవుతున్న విభిన్న జాతుల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించామని, ఇందులో భాగంగా పండుగప్ప పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రయోగాత్మకంగా 50 శాతం రాయితీతో ఎచ్చెర్లలో ఒక హెక్టారులో సాగు చేయాలని సంకల్పించామన్నారు. త్వరలోనే ఉమ్మడి విశాఖ జిల్లాలోనూ పండుగప్ప సాగును ప్రారంభిస్తామన్నారు. పండుగప్పను పెంచేందుకు ఆక్వా రైతు ఒక హెక్టారు భూమి సమకూరిస్తే సీడ్, ఫీడ్ కూడా ప్రభుత్వమే సగం ధరకు సరఫరా చేస్తుందన్నారు. దిగుబడిలో వచ్చిన లాభాల్లో 75 శాతం రైతుకు ఇచ్చిన 25 శాతం ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. హేచరీస్, పండుగప్ప, కిలాపీ తదితర హేచరీస్‌లకు, నర్సరీ పాండ్ల నిర్మాణాలకు 50 శాతం సబ్సిడీ ఇస్తున్నామన్నారు. ఇటువంటి హేచరీస్‌లు ఏర్పాటు చేసుకునే వారికి రూ.కోటి రూపాయల వరకు సబ్సిడీ ఇస్తున్నామన్నారు. రాజీవ్ గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా కల్చర్, నేషనల్ సెంటర్ ఫర్ సస్టైన్ ఆక్వా కల్చర్ వంటి ల్యాబ్‌ల ద్వారా పరిశోధనలు చేసి విభిన్న జాతుల పెంపకం, కనుమరుగైన నీలకంఠ రొయ్య, బ్లాక్‌టైగర్ వంటి రొయ్యలను ఉత్పత్తి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఆప్కాఫ్ వైస్ చైర్మన్ మాతా గురునాథరావు, మత్స్యశాఖ ఏడీ కృష్ణమోహన్, ఎంపెడా నిపుణులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి

డీఈవో వెంకటలక్ష్మమ్మ


మాట్లాడుతున్న డీఈవో

చోడవరం రూరల్ : దివ్యాంగులలో ఆత్మవిశ్వాసం పెంపొందిస్తే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ అన్నారు. పద్దెనిమిదేళ్లలోపు దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కోసం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువారం గుర్తింపు శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 140 మంది బాలబాలికలు వారి తల్లిదండ్రులతో హాజరయ్యారు. వారిలో 94 మందిని ఉపకరణాల పంపిణీకి అర్హులుగా గుర్తించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డీఈవో మాట్లాడుతూ పిల్లలకు ప్రథమ గురువు తల్లి అని, దివ్యాంగులలో ఆత్మస్థైర్యం నింపడంలో తల్లి ముందుండాలన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి వివిధ రకాల సేవలను అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.శకుంతల, మండల విద్యాధికారి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు వసంత, అప్పలరాజు తదితరులు, రిసోర్స్ ఉపాధ్యాయులు జగన్నాథం నాయుడు, రిసోర్స్‌పర్సన్ కె.వి.ఎం.నాయుడు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మారేడుమిల్లి : ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఖాళీల భర్తీకి విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని స్థానిక ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌జీ కిషోర్ బాబు తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో వై.రామవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి, రంపచోడవరం, అడ్డతీగల, చింతూరులోని ఏకలవ్య పాఠశాలలో ఆరో తరగతిలోకి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. అడ్డతీగల, చింతూరు, మారేడుమిల్లి, రంపచోడవరంలో పాఠశాలలో ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో ఖాళీలను రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేవారు 13 సంవత్సరాలు, ఏడో తరగతికి 14, ఎనిమిదో తరగతికి 15 , తొమ్మిదో తరగతికి 16 సంవత్సరాల వయసు ఉండాలన్నారు. ఆరో తరగతిలో ప్రవేశానికి 100 మార్కులు, ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతులకు 200 మార్కులకు రాత పరీక్ష ఆంగ్లం, తెలుగులో ఉంటుందన్నారు. దరఖాస్తుల సమర్పణకు ఏప్రిల్ 15 చివరి తేదీ అన్నారు. రాజవొమ్మంగి, రంపచోడవరం , చింతూరులో ఈనెల 30న రాత పరీక్ష నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

మెయిన్ రోడ్డు తక్షణమే విస్తరించాలి


వ్యాపారుల తీరుకు నిరసనగా ర్యాలీ చేపట్టిన ప్రజలు

నర్సీపట్నంలో భారీ ప్రదర్శన

నర్సీపట్నం : పట్టణంలో మెయిన్ రోడ్డు విస్తరణను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ రాజకీయాలకు అతీతంగా నర్సీపట్నం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రీకన్య కూడలిలో మానవహారంగా ఏర్పడి వ్యాపారుల తీరుకు నిరసన వ్యక్తం చేశారు. వంద అడుగులు కాకుండా 120 అడుగులు విస్తరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రోడ్డు విస్తరించకపోవడం వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నారంటూ నినదించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ కొనసాగింది. ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ సభ్యులు మాకిరెడ్డి బుల్లిదొర, ఎం.సతీష్, ప్రసాద్ మాట్లాడుతూ గత పాలకులు ప్రకటనలకే పరిమితమయ్యారన్నారు. ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి మెయిన్‌రోడ్డు విస్తరణతో పాటు వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెదబొడ్డేపల్లి వరకు ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణానికి రూ.16 కోట్లు మంజూరు చేయించారన్నారు. వ్యాపారులు స్వలాభం కోసం రోడ్డు విస్తరణకు అడ్డుపడడం సరికాదన్నారు. వంద అడుగులు కాకుండా 60 అడుగులు రోడ్డు విస్తరించాలని వ్యాపారులు ఆందోళన చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వ్యాపారుల తీరును నిరసిస్తూ ఈ రోజు రోడ్డు ఎక్కవలసి వచ్చిందన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు రావడం జరిగిందన్నారు. ఇప్పటికైనా వ్యాపారులు రోడ్డు విస్తరణపై రద్ధాంతం మానుకుని సహకరించాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందున అధికారులు సత్వరమే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కనకారావు, ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులకు వినతిపత్రం అందజేశారు.

120 అడుగులకు విస్తరించాలి : సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ

నర్సీపట్నం మెయిన్ రోడ్డును 120 అడుగులకు విస్తరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఎన్జీహోమ్‌లో గురువారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, వైద్యం, వ్యాపారం నిమిత్తం నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుంచి లక్షలాది మంది నిత్యం వస్తుంటారన్నారు. కొన్ని సంవత్సరాలుగా రోడ్డు విస్తరణకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను గుర్తించి రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేస్తే వ్యాపారులు అడ్డు పడడం సరికాదన్నారు. వ్యాపారుల ఒత్తిళ్లకు లొంగకుండా అధికారులు ప్రజల అవసరాల దృష్ట్యా వంద అడుగులు కాకుండా 120 అడుగులకు విస్తరించాలని డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణ తక్షణమే చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డి.సత్తిబాబు డిమాండ్ చేశారు. అభివృద్ధిని అడ్డుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. వాణిజ్య సముదాయాల ముందు పార్కింగ్ స్థలాలు లేక, ఉన్న రోడ్డు సరిపోవడం, డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుందని తెలిపారు.

వరికుప్ప దగ్ధం...రూ.50 వేలు నష్టం


వరికుప్పను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గొలుగొండ : ఆరుగాలం శ్రమించి పండించిన వరికుప్ప క్షణాల్లో మంటల్లో దగ్ధమై పోయిన ఘటన కొత్తపాలెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలివి. ఉదయం 11 గంటల సమయంలో గ్రామానికి చెందిన కూరాకుల అచ్చిబాబుకు చెందిన వరికుప్ప నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన రైతు చుట్టుపక్కల రైతుల సహాయంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించగా వారు వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే వరికుప్ప కాలిపోయింది. దీంతో రూ.50వేలు వరకు నష్టపోయినట్టు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉరి వేసుకుని మహిళ మృతి


గౌరీ దేవి మృతదేహం వద్ద బంధువులు

పాయకరావుపేట : మండలంలో గల గోపాలపట్నం గ్రామానికి చెందిన చింతాకుల గౌరీదేవి (24) అనే మహిళ ఇంటి దూలానికి ఉరి వేసుకుని మృతి చెందినట్టు ఎస్ఐ బి.జోగారావు తెలిపారు. మృతురాలు గౌరీదేవికి రెండు నెలలుగా తీవ్రమైన గొంతునొప్పితో బాధపడుతూ తుని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని, నొప్పి తగ్గని కారణంగా, ఆహారం తినక నీరసించిందని తెలిపారు. దీంతో మనస్తాపం చెంది గురువారం మధ్యాహ్నం ఇంటి దూలానికి ఉరి వేసుకుని మృతి చెందిందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రి తరలించామన్నారు. మృతురాలి తండ్రి చింతాకుల నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

దొంగనోట్ల ముఠా గుట్టురట్టు

- ఆదిలోనే పట్టుకున్న చింతూరు సబ్‌డివిజన్ పోలీసులు
- ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దాడులు
- ప్రధాన నిందితుల కోసం గాలింపు ముమ్మరం


అరెస్టు చేసిన దొంగనోట్ల ముఠాను చూపిస్తున్న పోలీసులు

చింతూరు: దొంగనోట్ల చలామణికి స్థానిక సబ్ డివిజన్ పోలీసులు ఆదిలోనే అడ్డుకట్ట వేశారు. గిరిజన ప్రాంతాల్లో చలామణికి టార్గెట్ చేసుకొని తెలంగాణ రాష్ట్రం పాల్వంచ కేంద్రంగా దొంగనోట్ల ముద్రణకు ముఠా తెరలేపింది. పాల్వంచ, ఉప్పల్, అశ్వారావుపేట, సత్తుపల్లి, పల్నాడు జిల్లా దుర్గికి చెందిన పాదిల మురళి, జంగం శ్రీనివాస్, కిరణ్‌కుమార్, పుల్లారావు, చిట్టిబాబు, శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఉమేష్‌చంద్రతో పాటు సామ్రాజ్యం అనే మహిళ ముఠాగా మూడు నెలల క్రితం ఏర్పడ్డారు. వీరు ముద్రించిన దొంగనోట్లను తెలంగాణలోని పాల్వంచ, భద్రాచలం, అల్లూరి జిల్లాలోని చింతూ రు, ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం, ఛత్తీస్‌గఢ్‌లోని కుంటలో చలామణి చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు రూ.2.50 లక్షల మేర దొంగనోట్లను మార్పిడి చేశారు.

పథకం ప్రకారం బురిడీ..

రద్దీ ప్రదేశాలైన వారాంతపు సంతలు, పెట్రోల్ బంకులు, కిరాణాషాపులు, హోటళ్లలో రాత్రివేళల్లో మార్పిడి చేస్తున్నారు. రూ.లక్ష దొంగనోట్లకు రూ.10 వేలు అసలు నగదు చెల్లించేలా ఏజెంట్లతో బేరం కుదుర్చుకుంటున్నారు. దొంగనోట్ల కోసం వచ్చే ఏజెంట్లను ముఠా సభ్యులు పథకం ప్రకారం బురిడీ కొట్టిస్తున్నారు. నోట్ల తయారీకి సంబంధించి డ్రాయింగ్ బ్లాక్ కలర్ చార్ట్ పేపరును ఉపయోగిస్తున్నారు. దీనిని రూ.500 నోట్ సైజ్‌లో కట్ చేసి వీటిని బండిల్‌గా సిద్ధం చేస్తున్నారు. దొంగనోట్ల కోసం వచ్చే ఏజెంట్లకు అసలు రూ.500 నోటుపై అయోడిన్ పూత పూయడంతో నలుపు రంగులో మారిన నోటుని బండిల్స్‌పై పెట్టి హైపో లిక్విడ్ ద్రావణంతో కడుగుతున్నారు. వీటన్నింటిని ఆరబెడితే ఒరిజనల్ నోట్లు మాదిరిగా కనిపిస్తాయని వారిని నమ్మిస్తున్నారు.

కదిలిన డొంక..

వీఆర్‌పురం మండలంలో లభించిన క్లూ ఆధారంగా తీగలాగిన పోలీసులకు దొంగనోట్ల ముఠా చిక్కింది. వీఆర్‌పురంలోని ఓ దుకాణానికి ఆటోలో వచ్చిన భార్యాభర్తలు రూ.500 నకిలీ నోటు మార్చేందుకు ప్రయత్నించారు. అనుమానం వచ్చిన షాపు యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని సోదా చేశారు. వారి నుంచి రూ.50 వేల విలువైన 500 రూపాయల దొంగనోట్లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రత్యేక బృందంగా ఏర్పడి..

దొంగనోట్ల చెలామణి వెనుక పెద్ద ముఠా ఉందని గ్రహించిన ఎటపాక సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐలు దుర్గాప్రసాద్, వెంకటేష్, పార్థసారధి ప్రత్యేక బృందంగా ఏర్పడ్డారు. సిబ్బందితో కలసి తెలంగాణలోని పాల్వంచ, భద్రాచలంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ 44.50 లక్షల విలువైన నకిలీ రూ 500 నోట్లు, దొంగనోట్ల తయారీకి వినియోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందుతులు ఇద్దరికోసం వారు గాలిస్తున్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: గుంతకల్ డివిజన్ పరిధిలో బేతంచర్ల–రంగాపురం–మల్కాపురం స్టేషన్ల పరిధిలో రెండవ లైన్ పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా విశాఖపట్నం మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్ల నిర్దేశించిన తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

- భువనేశ్వర్–బెంగళూరు(18463)ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు, బెంగళూరు–భువనేశ్వర్(18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు డోన్, గుంతకల్, గుత్తి మీదుగా కాకుండా వయా ఎర్రగుంట్ల, గుత్తి ఫోర్ట్ స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ మార్గంలో ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి ఫోర్ట్ స్టేషన్లలో తాత్కాలిక హాల్ట్ ఇచ్చారు.
- పూరిలో ఈ నెల 24న బయలుదేరే పూరి–యశ్వంత్‌పూర్(22883) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్‌లో ఈ నెల 25న బయలుదేరే యశ్వంత్‌పూర్–పూరి(22884) గరీబ్‌రథ్ డోన్ మీదుగా కాకుండా వయా ఎర్రగుంట్ల, గుత్తి ఫోర్ట్ స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తుంది. ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి ఫోర్ట్ స్టేషన్లలో ఈ రైలుకు తాత్కాలిక హాల్ట్ ఇచ్చారు.
- హౌరాలో ఈ నెల 22న బయలుదేరే హౌరా–శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం (22831), శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయంలో ఈ నెల 24న బయలుదేరే శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం–హౌరా (22832) ఎక్స్‌ప్రెస్ డోన్, గుత్తి మీదుగా కాకుండా వయా ఎర్రగుంట్ల, గుత్తి ఫోర్ట్ స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తుంది.ఈ మార్గంలో ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి ఫోర్ట్ స్టేషన్లలో ఈ రైలుకు తాత్కాలిక హాల్ట్ ఇచ్చారు.

విజయవాడ డివిజన్ పరిధిలో..

సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో గంగినేని–ఎర్రుపాలెం స్టేషన్ల మధ్య జరుగుతున్న నాన్‌ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లను దారి మళ్లిస్తున్నారు.

- విశాఖపట్నం–లోకమాన్యతిలక్ టెర్మినస్ (18519) ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు, లోకమాన్య తిలక్ టెర్మినస్–విశాఖపట్నం (18520) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు కాజీపేట మీదుగా కాకుండా వయా గుంటూరు, పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.
- యశ్వంత్‌పూర్‌లో ఈ నెల 19న బయలుదేరే యశ్వంత్‌పూర్–టాటానగర్ (18112) ఎక్స్‌ప్రెస్ వరంగల్, ఖమ్మం మీదుగా కాకుండా వయా గుంటూరు, పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది. ఈ రైలుకు గుంటూరులో తాత్కాలిక హాల్ట్ ఇచ్చారు.
- సికింద్రాబాద్‌లో ఈ నెల 21న బయలుదేరే సికింద్రాబాద్–షాలిమార్(12774) ఏసీ ఎక్స్‌ప్రెస్ వరంగల్, రాయనపాడు మీదుగా కాకుండా వయా గుంటూరు, పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం గుంటూరు, విజయవాడలలో తాత్కాలిక హాల్ట్ ఇచ్చారు.
- సంబల్‌పూర్ –నాందేడ్ (20809) ఈ నెల 19, 20, 21 తేదీల్లో, నాందేడ్– సంబల్‌పూర్(20810) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20, 21 తేదీల్లో రాయనపాడు, కాజీపేట మీదుగా కాకుండా వయా గుంటూరు, పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది. విజయవాడ, గుంటూరులో ఈ రైలుకు తాత్కాలిక హాల్ట్ ఇచ్చారు.
- విశాఖపట్నంలో ఈనెల 20న బయలుదేరే విశాఖపట్నం–నాందేడ్ (20811), నాందేడ్‌లో ఈ నెల 19న బయలుదేరే నాందేడ్–విశాఖపట్నం (20812) ఎక్స్‌ప్రెస్ రాయనపాడు, కాజీపేట మీదుగా కాకుండా వయా గుంటూరు, పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది. ఈ రైలుకు విజయవాడ, గుంటూరులో తాత్కాలిక హాల్ట్ ఇచ్చారు.
- విశాఖపట్నం–సికింద్రాబాద్ (12739) గరీబ్ రథ్ ఈ నెల 19, 20వ తేదీల్లో, సికింద్రాబాద్–విశాఖపట్నం(12740)) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19, 20వ తేదీల్లో ఖమ్మం, వరంగల్ మీదుగా కాకుండా వయా గుంటూరు, పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది. గుంటూరులో తాత్కాలిక హాల్ట్ ఇచ్చారు.
- ఈ నెల 21న బయలుదేరే ముంబయి ఛత్రపతి శివాజీ టెర్మినస్–భువనేశ్వర్(11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర స్టేషన్ల మీదుగా కాకుండా వయా గుంటూరు, పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది. గుంటూరులో తాత్కాలిక హాల్ట్ ఇచ్చారు. ప్రయాణికులు ఈ మార్పులు గమనించి రైల్వేకు సహకరించాలని అధికారులు కోరారు.

కొన్ని రైళ్లు రద్దు, మరికొన్ని గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: కేకే లైన్‌లోని మల్లిగుడ–ఛత్రిపుట్ మధ్య జరుగుతున్న పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డిసిఎం ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

రద్దు చేసిన రైళ్లు

- విశాఖపట్నం–కోరాపుట్(18512) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17, 20 తేదీల్లో రద్దు
- కోరాపుట్ –విశాఖపట్నం(18511) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18, 21 తేదీల్లో రద్దు
- కోరాపుట్–విశాఖపట్నం(08545) పా సింజర్ స్పెషల్ ఈనెల 23న రద్దు
- కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 23న రద్దు
- విశాఖపట్నం– కాకినాడ (17267/17268) మెము ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17, 18 తేదీల్లో రద్దు
- విశాఖపట్నం–రాజమండ్రి (07466/ 07467) మెము ఈ నెల 17,18 తేదీల్లో రద్దు

గమ్యం కుదించిన రైళ్లు


- కిరండూల్–విశాఖపట్నం(08552) ఈ నెల 17న కోరాపుట్ వరకే నడుస్తుంది. అక్కడ నుంచి తిరిగి కిరండూల్ చేరుకుంటుంది.
- విశాఖపట్నం–కోరాపుట్(08546) పాసింజర్ స్పెషల్ ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు రాయగడ వరకు మాత్రమే నడుస్తుంది.
- కోరాపుట్–విశాఖపట్నం(08545) పాసింజర్ స్పెషల్ ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు రాయగడ నుంచే బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం–కిరండూల్(08551) స్పెషల్ ఈ నెల 17 నుంచి 22 వరకు అరకు వరకు మాత్రమే నడుస్తుంది. ఈ తేదీల్లో అరకు–కిరండూల్ మధ్య ఈ రైలు రాకపోకలు సాగించదు.

బైక్ ప్రమాదంలో యువకుడి మృతి


చావల నాని మృతదేహం

పాయకరావుపేట : శ్రీరాంపురం గ్రామానికి చెందిన చావల నాని (22) అనే యువకుడు బైక్ ప్రమాదంలో గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. వివరాలివి. నాని తన స్నేహితుడైన కొంద్రపు చిన్నతో కలిసి చిన్న నర్సాపురం గ్రామం రోడ్డులో మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తుండగా కుక్క అడ్డంగా రావడంతో తప్పించబోయి బైక్‌పై నుంచి రోడ్డు పక్కన పడిపోయారు. దీంతో గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా నాని మృతి చెందినట్టు తెలిపారు. క్షతగాత్రుడు చిన్నను మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడం జరిగిందని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడికి గాయాలు


చికిత్స పొందుతున్న ముర్మూ

అనకాపల్లిటౌన్ : రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. చెన్నై నుంచి హౌరా వెళ్తున్న సూపర్‌ఫాస్ట్ రైలులో ప్రయాణిస్తున్న పశ్చిమబెంగాల్ రాష్ట్రం బిర్భూం జిల్లా బి.గోపాలపురానికి చెందిన ఎం.ముర్మూ అనే వ్యక్తి స్థానిక శారదానది బ్రిడ్జి వద్ద రైలు నుంచి జారి పడిపోయాడు. దీంతో అతని ఎడమకాలికి తీవ్రంగా గాయమైంది. స్థానికుల సహకారంతో బాధితుడ్ని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

క్లుప్తంగా

'భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి'


సమావేశంలో మాట్లాడుతున్న విల్లూరి రాము

అనకాపల్లిటౌన్ : సమగ్ర భూ సర్వే జరిపి వ్యవసాయ, ప్రభుత్వభూములు, పంటకాలువలు, జీవీఎంసీ స్థలాలు, రోడ్లు తదితర ఆక్రమిత స్థలాల్లో పక్కా నిర్మాణాలు చేపట్టిన వారి నుంచి ఆ స్థలాలను ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అనకాపల్లి వ్యవసాయదార్ల సంఘం అధ్యక్షుడు విల్లూరి రాము కోరారు. స్థానిక వీవీ రమణ రైతు భారతి హాల్లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూములను సర్వేచేసి నేటికి 70 సంవత్సరాలు కావస్తుందని, నేడు భూములను రీ సర్వే చేసి సమగ్ర హక్కు పత్రాలను రైతులకు అందించాలని సూచించారు. కొంతమంది వ్యక్తులు తాతల పేర్లు ఉన్నాయని చెప్తూ, అధికారుల్ని ప్రలోభాలకు గురిచేసి రైతుల్ని ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. భూమిని సాగు చేస్తున్న రైతుల పేరిట రికార్డుల్లో నమోదు చేసి, సరిహద్దు రైతుల సమక్షంలో ఎటువంటి వివాదాలకు అవకాశం లేకుండా సర్వే పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కాండ్రేగుల కృష్ణఅప్పారావు, సభ్యులు కె.వి.సూర్యనారాయణ, మళ్ల రామకృష్ణ, కర్రి మోదినాయుడు, కొణతాల శ్రీనివాసరావు, కాండ్రేగుల విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500 కే వంటగ్యాస్


అమరజీవి విగ్రహానికి నివాళులర్పించి జోడో పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కశింకోట : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పంచాయతీ ప్రధాన రహదారిలోని శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. పార్టీ విధానాలపై కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500కే వంట గ్యాస్ అందించడంతోపాటు, ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జోడో సమన్వయ కమిటీ సభ్యుడు మల్లపురెడ్డి కోటేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి కత్తెర శ్రీధర్, జిల్లా న్యాయ విభాగం అధ్యక్షుడు సూరా శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి బోయిన భానుమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ఆర్ నాయుడు, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సూరిశెట్టి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
ఫలానా అబ్బాయి	
ఫలానా అమ్మాయి	సత్యనారాయణస్క్రీన్-1
మనసిస్తావా	సత్యనారాయణస్క్రీన్-2
కబ్జా	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
షజామ్	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
జంతు ప్రపంచం	రామచంద్ర

క'న్నీటి' కష్టాలకు చెక్

- రూ.51.05 లక్షల నిధులు మంజూరు
- పట్టణంలో 5 పెద్ద వాటర్ ట్యాంకులు
- వార్డుల్లో 104 మినీ వాటర్ ట్యాంక్‌లు
- శారదానదిలో క్రాస్‌బాండ్ నిర్మాణం


విజయరామరాజుపేటలో హ్యాండ్‌బోర్ రిపేరు చేస్తున్న సిబ్బంది


వేల్పులవీధిలో 1000 కిలో లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్

అనకాపల్లిటౌన్ : వేసవి వస్తూనే.. తన వెంట నీటి ఎద్దడిని కూడా తీసుకొస్తుంది. వేసవిలో తాగునీటికి కూడా కటకటలాడే పరిస్థితుల్ని ఎన్నోసార్లు చూశాం. అదంతా గతం. వరుణుడు వైఎస్సార్‌సీపీతో దోస్తీ కట్టి.. జలాశయాల్లో నీటికి ఢోకా లేకుండా చేశాడు. మరోవైపు ప్రస్తుత ప్రభుత్వం కూడా తాగునీటి ఇక్కట్లపై ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. గతంలో మాదిరి.. ఇళ్లు తగలబడుతుంటే.. బావులు తవ్వే పరిస్థితులు పోయాయి. అందుకే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుగానే అనకాపల్లి జోన్ పరిధిలో వేసవి తాగునీటి ఇక్కట్లు తలెత్తకుండా రూ.51.05 లక్షలతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది.

సగటున 140 లీటర్ల సరఫరాకు చర్యలు

అనకాపల్లి కొత్త జిల్లాగా ఏర్పాటయ్యాక పట్టణంలోను, జీవీఎంసీ విలీన గ్రామాల్లో జనాభా రోజురోజుకూ పెరుగుతోంది. కనీస అవసరాలపై కూడా ఒత్తిడి నెలకొంటోంది. ప్రధానంగా తాగునీటి సమస్యపై అధికారులు దృష్టిసారించారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటూనే, ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు రూ.51.05 లక్షల నిధులు కేటాయించారు. అత్యవసర సమయాల్లో ఈ నిధులను ఖర్చుచేస్తున్నారు. ఒక్కొక్క మనిషికి సగటున రోజుకు 140 లీటర్ల నీరందించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు.

శారదానదిలో క్రాస్‌బాండ్

మండలంలోని తుమ్మపాల పంచాయతీ పరిధిలో హెడ్‌వర్క్ ద్వారా శారదా నీరు సముద్రంలో కలిసి పోతోంది. దీన్ని వేసవిలో తాగునీటికి మళ్లించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వాటర్ హెడ్ వర్క్స్‌కు నీరందించే శారదానదిలో క్రాస్‌బాండ్ నిర్మించి, నీరు వృధాగా సముద్రంలోకి పోకుండా నియంత్రించొచ్చు. ఇందుకు రూ.5.30 లక్షల నిధుల్ని కేటాయించారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభంకానున్నాయి.

వేసవి కార్యాచరణ

- పట్టణ పరిధిలో ప్రధాన ప్రాంతాల్లో వెయ్యి కిలో లీటర్ల సమార్థ్యం గల ఐదు ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారానే నిత్యం ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. వీటి మరమ్మతుల నిమిత్తం రూ.6.65 లక్షల నిధులు మంజూరు చేసింది.
- జోన్ పరిధిలో ఉన్న ఐదు(80 నుంచి 84) వార్డుల్లో కొత్తగా ఏడు బోట్ల చేతి పంపు(బోర్లు)ల ఏర్పాటుకు రూ.9.80 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో ఇప్పటికే పనులను ప్రారంభించారు.
- మరో రూ.9.80 లక్షలతో పట్టణ, జీవీఎంసీ విలీన గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ల మరమ్మతులను చేపడుతున్నారు.
- వార్డుల్లో 104 మినీ వాటర్‌ట్యాంక్‌లు ఉన్నాయి. వీటిద్వారా స్థానికులకు తాగునీరు అందిస్తున్నారు. ట్యాంక్‌లు, మోటార్లు, పైప్‌ల మరమ్మతుల కోసం రూ.9.75 లక్షల నిధుల్ని కేటాయించారు.
- వీటితోపాటు అత్యవసర సమయంలో వాటర్ ట్యాంకర్ల ద్వారా ఆయా ప్రాంతాలకు నీరందించేందుకు 5000 లీటర్ల సామర్థ్యమున్న నీటి సరఫరా వ్యాన్లు రెండింటిని జోన్ పరిధిలో అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం వీటి ద్వారా వివాహాది శుభకార్యాలకు, సమావేశాలకు తాగునీటి సరఫరా చేస్తున్నారు.
- పట్టణ పరిధిలో 403, విలీన గ్రామాల్లో 88 చేతి పంపులు(హ్యాండ్‌బోర్లు) ఉన్నాయి. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో బోర్లు బాగానే పనిచేస్తున్నాయి. ఎక్కడైన బోర్లు రిపేరుకు వస్తే తమకు సమచారమిస్తే.. తక్షణమే మరమ్మతులు చేపడతామని జీవీఎంసీ నీటిసరఫరా విభాగం అధికారులు చెప్తున్నారు.

సమస్య ఉంటే చెప్పండి



రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. జీవీఎంసీ వార్డుల పరిధిలో ప్రత్యేక నిధులతో చాలా వరకు నీటి సరఫరా సమస్యల్ని పరిష్కరించాం. జీవీఎంసీ జోన్ పరిధిలో ఏ ప్రాంతంలోనైనా తాగునీటి సమస్యలుంటే తక్షణమే జోనల్ కార్యాలయంలో నివేదించండి. త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తాం.
– పి.కేదార్‌నాథ్, ఏఈ, జీవీఎంసీ వాటర్‌సప్లై

పారిశుధ్యం మెరుగుకు చర్యలు


చెరువు పనులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి


తాళ్లపాలెం సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న శిరీషారాణి

కశింకోట : పారిశుధ్యం మెరుగుపర్చడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని తాళ్లపాలెం సంపద కేంద్రాన్ని గురువారం పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. సంపద కేంద్రంలో తయారయ్యే వర్మీ కంపోస్టుతో ప్రాంగణంలో సాగు చేస్తున్న కూరగాయలు, ఆకు కూరలను పరిశీలించారు. అలాగే అక్కడి చెరువు అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఉగ్గినపాలెంలో చెరువు అభివృద్ధి పనులను కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీడీవో కొంకి అప్పారావు, తాళ్లపాలెం పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఎల్లయ్యకాలువలో పూడికలు తొలగించాలి


కాలువను పరిశీలిస్తున్న ప్రజాసంఘాల నేతలు

అనకాపల్లిటౌన్ : పట్టణం మధ్య నుంచి పంట పొలాలకు సాగునీరందించే ఎల్లయ్యకాలువ జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం వల్ల నిరుపయోగంగా మారుతోందని ప్రజాసంఘాల నేతలు ఆరోపించారు. స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానం మీదుగా ప్రవహిస్తున్న ఎల్లయ్యకాలువ వద్ద సంఘాల నేతలు గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుమ్మపాల పంచాయతీ, గుండాల కూడలి నుంచి పూల్‌బాగ్ రహదారి మీదుగా పారుతున్న ఈ కాలువ పూడికలతో నిండిపోయిందన్నారు. సాగునీటి కాలువలో తక్షణమే పూడికలు తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, సమాణిక్యాలరావు, బండి అప్పారావు పాల్గొన్నారు.

30న సీతారామ కల్యాణం


కల్యాణ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ

అనకాపల్లిటౌన్ : స్థానిక చినబజారు సీతారామాలయంలో ఈ నెల 30న సీతారాముల కల్యాణ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ శాశ్వత గౌరవాధ్యక్షుడు కొణతాల జగన్నాథంనాయుడు తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో కల్యాణ కరపత్రాన్ని ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27న స్వామివారి పెళ్లిరాట మహోత్సవం, 30న సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. టీటీడీ నుంచి తీసుకొచ్చిన స్వామివారి ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, ఊరేగింపు నిర్వహించి, అనంతరం కల్యాణం జరపడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ధర తగ్గిన టమాటా



కశింకోట : స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర తగ్గింది. గత వారం కిలో రూ.30 ఉండగా, ఈ వారం కిలో రూ.20కి తగ్గింది. బంగాళాదుంప రూ.20 నుంచి రూ.30కి పెరిగింది. ఇక ఉల్లిపాయ, క్యాబేజీ రూ.20, క్యారెట్, వంకాయ, బీట్‌రూట్ రూ.40, బెండకాయ, కాకర, బీన్స్ 60, క్యాప్సికం రూ.80కి అమ్మకాలు సాగాయి.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం తొలిరోజు పరీక్షలు ప్రశాంతం


సర్వేపల్లి రాధాకృష్ణ కళాశాలలో క్యూలైన్‌లో ఉన్న విద్యార్థులు


చైతన్యకళాశాల వద్ద పరీక్షా హాల్‌ను తెలుసుకుంటున్న విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఏడు పరీక్షా కేంద్రాల్లో 3,046 మంది విద్యార్థులకుగాను 2,999 మంది హాజరుకాగా, 47 మంది గైర్హాజరయ్యారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్‌ను పకడ్బందీగా అమలు చేశారు. మాస్‌కాపీయింగ్‌కు తావులేకుండా సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు. తొలి రోజైన గురువారం తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ, ఒకేషనల్ సబ్జెక్టులకు పరీక్షలు జరిగాయి. సర్వేపల్లి, సంయుక్త, ఏఎంఏఎల్, ఆదినారాయణ, నారాయణ, చైతన్య కళాశాలల్లో పరీక్షలు నిర్వహించారు. ఆలస్యం కారణంగా పరీక్షలకు హాజరుకాలేక పోయిన సంఘటనలేవీ జరగలేదు.

20 నుంచి నూకాంబిక కొత్త అమావాస్య ఉత్సవాలు

కశింకోట : కశింకోటలో ప్రసిద్ధి చెందిన నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య ఉత్సవాలు ఈ నెల 20 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త వేగి శివగణేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సాయంత్రం జాలర్ల జాతర, సారె ఊరేగింపు, రాత్రి అమ్మ వారి జాగరణ, 21న కొత్త అమావాస్య జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ఉదయం వెలమ సంక్షేమ సంఘం, సాయంత్రం చౌడేశ్వరి దేవాంగుల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో సారె ఊరేగింపులు, ప్రభలతో అమ్మ వారి ఘటాల ఊరేగింపు, అనంతరం ఆలయం వద్ద అగ్ని గుండాలు తొక్కడం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. 22న ఉగాది సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

బీజేపీ గ్రామకమిటీ అధ్యక్షుడి మృతి


బొబ్బరి అప్పారావు (ఫైల్)

కశింకోట : కశింకోట గ్రామ బీజేపీ కమిటీ అధ్యక్షుడు బొబ్బరి అప్పారావు(67) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. భౌతిక కాయానికి బీజేపీ జెండా కప్పి పలువురు పార్టీ స్థానిక నాయకులు నివాళులర్పించారు. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్యక్రియలు జరిపారు. బీజేపీ అభివృద్ధికి అప్పారావు చేసిన కృషిని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు కొనియాడారు.

'వైఎస్సార్ ఆసరా'పై ఇంటింటా ప్రచారం


వెదురుపర్తిలో వైఎస్సార్ ఆసరా పథకంపై ఇంటింటి ప్రచారం చేస్తున్న వెలుగు సిబ్బంది

కశింకోట : వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నగదును ఈ నెల 25న స్వయం సహాయక సంఘాల మహిళల బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రామన్నపాలెం, వెదురుపర్తి, సోమవరం, కన్నూరుపాలెం, మోసయ్యపేట తదితర గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా పథకంలో మూడో విడత నగదు బ్యాంకు ఖాతాలకు జమ కానుండటంపై అవగాహన కల్పించారు. ముందస్తుగా సిబ్బందితో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదు జమ కార్యక్రమాన్ని ఈ నెల 25న ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ఆసరా సొమ్ము జమ కానుందన్నారు. మండలంలో 1537 స్వయం సహాయక సంఘాలకు మూడో విడతగా రూ. 13.27 కోట్లు జమ చేయనున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే మొదటి, రెండవ విడతల్లో రూ.26.54 కోట్ల నగదును లబ్ధిదారుల ఖాతాల్లో వేసినట్టు తెలిపారు. ఉపాధి అవకాశాల కోసం దిగ్గజ కంపెనీలతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. వీవోఏలు సత్యశ్రీ, మంగ, సీసీ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

మంచు ముసుగేసింది!


కశింకోటలో గురువారం దట్టంగా మంచు కురిసింది. ఇళ్లు, చెట్లపైన, దారుల్లోను మంచు ఆవహించింది. ప్రధానంగా శారదానది అవతల ఉన్న పొలాలకు వెళ్లే గోర్జి అంతటా మంచు ముసుగేయడంతో దారి కానక రైతులు ఇబ్బందిపడ్డారు. ఉదయం 8 గంటలైనా మంచు తెరలు తొలగిపోలేదు. సూర్యతాపం పెరుగుతున్న కొద్దీ మంచు తెరలు క్రమేపీ తొలగి, జనాలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ మంచు తాకిడి మామిడి, జీడిమామిడి పంటలకు నష్టం కలిగించనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.
– కశింకోట

'అమరజీవి' పొట్టి శ్రీరాములు

- ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ విజయ్‌భాస్కర్


పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ బంగార్రాజు

అనకాపల్లిటౌన్ : తెలుగువారికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ దీక్ష చేసి, ప్రాణాలర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని జిల్లా అదనపు ఎస్పీలు బి.విజయ్‌భాస్కర్, పి.సత్యనారాయణలు అన్నారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో పొట్టి శ్రీరాముల జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. యువత పొట్టి శ్రీరాములను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

తుమ్మపాల : అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి వేడుకలు పట్టణంలో గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక రామచంద్ర థియేటర్ జంక్షన్‌లో పొట్టిశ్రీరాముల విగ్రహం వద్ద సిద్ధార్థ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకల్లో పట్టణ ట్రాఫిక్ ఎస్సై డి.బంగార్రాజు పాల్గొని అమరజీవి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం మద్రాసులో 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షతో ప్రాణత్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం మాట్లాడుతూ జీవితాన్ని సమాజ సేవకే అంకితం చేసిన ఆయనకు ప్రభుత్వం భారతరత్న ప్రకటించి గౌరవించుకోవాలన్నారు. ఆయన జీవిత చరిత్రను పదవ తరగతి పాఠ్యపుస్తకాల్లో చేర్చి నేటి యువతకు ఆయన స్ఫూర్తిని అందించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శి గైపూరి రాజు, కాండ్రేగుల శ్రీనివాస్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వినకోట నీలేష్‌గుప్తా, సభ్యులు దేగల సత్యనారాయణ, వాసవీక్లబ్ చైర్మన్ వినకోట బుచ్చిరాజు, విభిన్నప్రతిభావంతుల సంఘం చైర్మన్ పాత్రపల్లి వీరుయాదవ్ పాల్గొన్నారు.

- స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయ సమీపంలో పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద వాసవీక్లబ్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ రీజనల్ చైర్మన్ గుండా రమేష్‌గుప్తా పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీ సిద్ధాంతాలను అలవర్చుకుని దీక్ష చేపట్టి, ప్రాణత్యాగం ద్వారా ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని తీసుకొచ్చిన మహనీయుడు పొట్టి శ్రీరాములని కొనియాడారు. ఆయన జయంతిని పురస్కరించుకుని విజయరామరాజు పేట లెప్రసీ కాలనీలో 37 మంది వికలాంగులకు ఉపకరణాలు అందించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సతీష్, పి.సత్య, కేపీవీ స్వామి, కె.కోటేశ్వరరావు, వీఎస్‌కే హరినాథ్, పలుకూరి శంకర్ పాల్గొన్నారు.
- పట్టణంలోని మెయిన్‌రోడ్డు వద్ద సర్వేజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన అమరజీవి జయంతి వేడుకల్లో హ్యూమన్‌రైట్స్ టౌన్ కార్యదర్శి కోరిబిల్లి పరి పాల్గొని, శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఇంకుల మధు, కర్రి భాను, మల్ల వంశీ, కాకర్ల ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.
- నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ (న్యూఢిల్లీ) ఆధ్వర్యంలో ఫోరం పట్టణ ప్రధాన కార్యదర్శి సూదికొండ మాణిక్యాలరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ పట్టణంలోని మెయిన్‌రోడ్డు పైనున్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అమరజీవి పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిరట్ల నరసింహమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.


అమరజీవి చిత్రపటాలతో ఆస్క్ ఇంజినీరింగ్ విద్యార్థులు

అనకాపల్లి రూరల్ : పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం వల్లే ప్రత్యేక తెలుగు రాష్ట్రం ఏర్పడిందని అనకాపల్లి ఆస్క్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ అన్నారు. అమరజీవి జయంతి సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీ రాముల జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. 1952 అక్టోబరు 19న ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణ దీక్ష చేపట్టిన పొట్టి శ్రీరాములు అదే ఏడాది డిసెంబర్ 15న మరణించారని తెలిపారు. ఆయన మరణానంతరం 1953 అక్టోబరు 1 న ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. అమరజీవిగా ఖ్యాతినార్జించిన శ్రీరాములు ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం పొందారని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.